


## శ్రీవారి దర్శనంలో విద్యావల్లభతీర్థస్వామి

తిరుమల, అక్టోబర్ 15ప్రభాతవార్తప్రతినిధి:



ఉడిపి కణియూరుమఠం పీఠాధిపతి విద్యావల్లభ తీర్థస్వామి శిష్యులతో కలసి బుధవారం ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, బొక్కసం ఇన్‌ఛార్జి గురురాజారావు, అర్చకులు స్వాగతం పలికి వెంకన్న దర్శనం చేయించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



కాణిపాకం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు బుధవారం 5 లక్షల రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు బెంగుళూరుకు చెందిన కెవి.అమర్నాథ్ అనే భక్తుడు ఈపథకానికి 5 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రూ.14 లక్షల విలువైన ఎర్రదుంగలు స్వాధీనం

### స్పీడ్‌గా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బయటపడ్డ ఎర్రచందనం





చికిత్స పొందుతున్న వెంకటస్వామి, పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు

బంగారుపాళ్యం, అక్టోబర్ 15 ప్రభాతవార్త: చిత్తూరు-బెంగళూరు జాతీయ రహదారిలో బంగారుపాళ్యం మండల పరిధిలో కాటప్పగారిపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతివేగంగా వస్తున్న ఓ కార్డు ద్విచక్రవాహనంను ఢీకొన్న ఘటనలో 14 లక్షల రూపాయల విలువైన ఎర్రచందనం దుంగలు వెలుగు చూశాయి. కల్లూరు పల్లి పంచాయతీ కొరివివారిపల్లికి చెందిన వెంకటస్వామి(52) ద్విచక్రవాహనంలో చిత్తూరు వైపుకు వస్తుండగా పలమనేరు వైపు నుండి చిత్తూరు వైపుకు అతివేగంగా వస్తున్న కారు డీకొన డంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారు మితి మీరిన వేగంతో ప్రయాణిస్తుండటంతో అదుపుతప్పి రోడ్డు ప్రక్కనే వున్న ముళ్ళ పొదల్లోకి వెళ్ళింది. కారులో ప్రయాణిస్తున్న దుండగులు అక్కడి నుండి లేచి పారిపోయారు. స్థానికులు ప్రమాదం జరిగిన విషయంను బంగారుపాళ్యం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ముళ్ళ పొదల్లోకి వెళ్ళి ఆగిపోయిన కారును పరిశీలించిన పోలీసులు అవాక్కయ్యారు. కారు వెనుక డిక్కీలో 9 ఎర్రచందనం దుంగలు లభ్యం అయ్యాయి. వీటి విలువ 14 లక్షల రూపాయలు వుంటాయని పోలీసులు నిర్ధారించారు. అలాగే పలమనేరు వైపు నుండి చిత్తూరు వైపుకు ఎర్రచందనం స్మగ్లర్లు దుంగలను కారులో తీసు కెళ్తుండగా ప్రమాదవశాత్తు ఈ ఘటన జరుగడంతో దుండగులు కారును అక్కడే వదలి పారిపోయారని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయంపె బంగారుపాళ్యం ఎస్ఐ టి.ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పు అడిగాడని హత్య చేసేశారు

### నగరి మునిసిపాలిటీ పుదుపేటలో దారుణ హత్య

### నేరం నీడలా వెంటాడింది... ఆలస్యంగా బయటపడ్డ నిజం



చెరువులో దొరికిన హతుడి ఎముకలు

పుత్తూరు, అక్టోబరు 15 ప్రభాతవార్త : ఇచ్చిన అప్పును తిరిగి అడిగినందుకు ఒక వ్యక్తిని దారుణంగా చంపి, ముక్కలుగా కోసి చెరువులో పారేసిన సంఘటన నగరి మునిసిపాలిటీలో జరిగింది. హత్యకు గురైన వ్యక్తి, హంతకులు నగరి మునిసిపాలిటీకి చెందిన వారు అయినప్పటికీ ఈ సంఘటన తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడం వల్ల ఈ కేసును తిరుత్తణి పోలీసులు విచారణ చేస్తున్నారు. గుణశీలన్ (65)ను హత్య చేశారనే అభియోగంపై అయ్యప్పన్, గంగాధరంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగి నాలుగు నెలలు గడిచిపోయి...హంతకులు హమ్మయ్య ఎవరూ కనిపెట్టలేకపోయారని లోలోపల సంతోషపడుతున్న సమయంలో...చేసిన నేరం నీడగా వెంటాడి వాళ్లని పోలీసులకు పట్టిచ్చింది. వివరాలు ఇలా వున్నాయి. నగరి పుదుపేటకు చెందిన గుణశీలన్‌కు సంగీత, జ్యోతి అనే ఇద్దరు కుమార్తెలు, వసంత్, విజయ్ అనే ఇద్దరు కుమారులున్నారు. అందరికీ వివాహాలు జరిగిపోయాయి. గుణశీలన్ చిన్న కుమారుడు విజయ్ పెళ్లి చేసుకున్న ఆరు నెలలకే కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడు. వివాహం కాక ముందు విజయ్ తన పేరిట రూ. 1.25 కోట్లకు ఇన్స్యూరెన్స్ చేసి తల్లితండ్రులను నామినీగా పెట్టాడు. విజయ్ మరణానంతరం వచ్చిన డబ్బును గుణశీలన్ పిల్లలకు తలా కొంత ఇచ్చి మిగిలిన సొమ్మును తన వద్దే పెట్టుకున్నాడు. ఇదిలా వుండగా గుణశీలన్‌కు మృతి చెందిన విజయ్ భార్య తండ్రి, వియ్యంకుడైన గంగాధరానికి ఈ డబ్బు విషయంలో తగాదా వచ్చింది. తన కుమార్తెకు రావాల్సిన వాటా ఇవ్వనందుకు గంగాధరం తరచూ గుణశీలన్‌తో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గుణశీలన్ పుదుపేటలో వున్న తన ఇంటిని స్థానికంగా వుండే అయ్యప్పన్‌కు అద్దెకు ఇచ్చి తిరుత్తణిలో స్థిర నివాసం ఏర్పరుచుకున్న తన పెద్ద కుమార్తె సంగీత వద్ద వుంటున్నాడు. అలాగే రూ. 45 లక్షలను అయ్యప్పన్‌కు అప్పు ఇచ్చాడు. ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వాలని అయ్యప్పన్‌పై గుణశీలన్ వత్తిడి తీసుకువచ్చాడు. ఈ పరిస్థితుల్లో ఇన్స్యూరెన్స్ డబ్బులో తన కుమార్తె వాటా ఇవ్వలేదని అక్కసుతో వున్న గంగాధరం, ఎలాగైనా తీసుకున్న అప్పును ఎగ్గొట్టాలని చూసే అయ్యప్పన్‌తో జత కలిశాడు. దాంతో ఒక పథకం ప్రకారం అయ్యప్పన్ తిరుత్తణి వెళ్లి డబ్బిస్తామని చెప్పి గుణశీలన్‌ను తమతో పాటు నగరికి రమ్మని అడిగారు. ఈ ఏడాది జూన్ 20వ తేదీన తిరుత్తణిలో బయలుదేరిన తర్వాత మార్గమధ్యంలో ఇద్దరు కలిసి కత్రతో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా నరికి వేసి నగరి రూరల్ మండలం ఎం.కొత్తూరు చెరువులో చెల్లాచెదురుగా పారేశారు. తన తండ్రి కనిపించకపోవడంతో ప్రశ్నించగా దేవాలయాల దర్శనానికి వెళ్లాడని అయ్యప్పన్ సమాధానమిచ్చాడు. రోజులు గడిచినా తన తండ్రి తిరిగి రాకపోయే సరికి సంగీత తిరుత్తణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు అనుకుని తేలిగ్గా తీసుకున్నారు. దాంతో ఆమె హైకోర్టులో కేసు వేశారు. గుణశీలన్ వెతికి తీసుకురావాలని కోర్టు ఆదేశించినా పోలీసులు స్పందించలేదు. తర్వాత సంగీత మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఐపిఎస్ అధికారి అయిన తిరువళ్లూరు ఎస్‌పి శుభంకు ఫిర్యాదు చేయడంతో ఆయన చొరవ తీసుకుని విచారణ ప్రారంభించారు. మొదటి అనుమానితుడైన అయ్యప్పన్‌ను విచారించగా అసలు విషయం బయటపడింది. దాంతో తిరుత్తణి పోలీసులు బుధవారం ఉదయం నగరిలోని ఎం.కొత్తూరు చెరువులో మృతదేహం కోసం వెతికారు. మృతదేహం సుమారు 115 రోజుల పాటు చెరువులో వుండడంవల్ల చేపలు ఇతర క్రిమి, కీటకాలు చాలా వరకూ తినేశాయి. మొండానికి చెందిన ఎముకలు మాత్రమే దొరికాయి. తిరుత్తణి పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 15, ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానికగా కిడ్నీ డయాలసిస్ కేంద్రం లేనందున డయాలసిస్ చేసుకునేందుకు ఇక్కడ వారు నెల్లూరు తిరుపతి వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. పేదలకు అందుబాటులో ఉండేందుకు కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ హాస్పిటల్‌తో సమానంగా వైద్యం అందుతున్నట్లు చెప్పారు. గుండెపోటు వచ్చిన వారికి వెంటనే వైద్యం అందించేందుకు అందుబాటులో ఇంజక్షన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 50 వేల రూపాయల విలువ కలిగిన ఇంజక్షన్‌ను ఉచితంగా చేస్తారని చెప్పారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు ఉన్నాయని చెప్పారు. పేదలకు 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆస్పత్రిలో మందులను పరిశీలించారు. వైద్యం ఏ విధంగా అందుతుందో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ జిలాని భాష, టిడిపి నాయకులు శివారెడ్డి, కోటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రైలు క్రిందపడి విద్యార్థి దుర్మరణం

చంద్రగిరి, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

రైలు క్రిందపడి విద్యార్థి దుర్మరణం పాలైన దుర్ఘటన బుధవారం ముంగిలిపట్టు వద్ద చోటు చేసుకుంది. కొంగరవారిపల్లెలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి మద్యం సేవించి స్కూల్‌కు వచ్చినట్లు సమాచారం. ఇది తెలుకున్న టీచర్ విద్యార్థిని మందలించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో భయపడి స్కూల్ నుండి గోడదూకి పారిపోయాడు. ముంగిలిపట్టు వద్ద రైలు క్రిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో సమాచారం అందుకున్న పాకాల రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### సర్వాంగ హంగులతో

## తిరుచానూరు రైల్వేస్టేషన్

### తిరుచానూరు కేంద్రంగా పలు రైళ్లు ప్రారంభం...



రేణిగుంట, అక్టోబర్ 15 ప్రభాతవార్త

తిరుచానూరు రైల్వేస్టేషన్ దాదాపు 120 కోట్ల పెట్టుబడులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుతుంది. అత్యాధునిక సౌకర్యాలతో కంప్యూటర్రైజేషన్ కావింపబడి తిరుచానూరు రైల్వేస్టేషన్ శ్రీ పద్మావతి సమేత శ్రీవారి సేవలో తరించనుంది. శ్రీవారి భక్తులకు ప్రయాణం సులభతరం చేయడానికి రైల్వేశాఖ తిరుచారు రైల్వేస్టేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. రైల్వే స్టేషన్ సేవలందించడంతో అటు రేణిగుంట ఇటు తిరుపతి మధ్యలో తిరుచానూరు పరిసరాలు అభివృద్ధి చెందనున్నాయి. రైల్వే స్టేషన్ తిరుపతి రేణిగుంట మార్గమధ్యంలో పారిశ్రామిక వాడవద్ద ఉండడంతో శ్రీవారి భక్తులు ముందుగా ఇక్కడ దిగి శ్రీవారి అనుబంధ ఆలయాలను సందర్శించుకుని శ్రీ పద్మావతి దేవి, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనాలు సులభతరం అవుతున్నాయి. తిరుచానూరు రైల్వే స్టేషన్ శ్రీవారి భక్తులకు ప్రధాన కేంద్రంగా శ్రీవారి భక్తులకు సేవలు అందించడానికి సమాయత్తం అయింది. ఈ స్టేషన్ నుండి నేరుగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దేవస్థానానికి, తిరుమల శ్రీవారి చెంతకు వెళ్లడానికి ఆర్టిసి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు..

## మరణంలోనూ వీడని అక్కాతమ్ముళ్ళ బంధం



మృతి చెందిన జయమ్మ

చౌడేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

తమ్ముని మృతి చెందడంతో తట్టుకోలేక అక్క గుండె ఆగింది. ఈ సంఘటన చౌడేపల్లి మండలం పెద్దయల్లకుంట్ల పంచాయతీ చెడుగుట్లపల్లిలో చోటు చేసుకొంది...గ్రామంలోని ఓబులప్ప, గుంటెమ్మలకు నలుగురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లడు జన్మించారు. వారిలో గంగరాజు(45)చివరి వాడు కాగా జయమ్మ(55) అందరి కంటే పెద్దావిడ. తల్లిదండ్రులు మరణించడంతో అందరి బాధ్యతలను జయమ్మ మరికొందరు అక్కాచెల్లెళ్ళు చూసుకొంటూ వచ్చారు. ముఖ్యంగా గంగరాజు అంటే చిన్నతనం నుంచి వారందరికీ మమకారం ఎక్కువగా వుండేది. ఈక్రమంలో గంగరాజు క్యాన్సర్ బారిన పడ్డాడు. వ్యాధి తీవ్రత అధికం కావడంతో మరణించాడు. దీంతో సోమల మండలం సోమాదిగుట్టపల్లిలో వున్న జయమ్మ సోదరుడి మరణవార్త విని వెంటనే అమ్మగారిళ్ళు చెడుగుట్లపల్లికి చేరుకొంది. గంగరాజు మృతదేహాన్ని చూసిన తర్వాత గట్టిగా రోదిస్తూ కుప్పకూలి కిందకు పడింది. గుర్తించిన బంధువులు ఆమెను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మార్గమధ్యలోనే జయమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఒకే పేగును తెంచుకొని పుట్టిన బంధం చావులోనూ వీడలేదని గ్రామస్తులు, బంధువులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. జయమ్మ మృతదేహానికి సోమాదిగుట్టపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

# ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల అభివృద్ధికి కీలక నిర్ణయాలు

తిరుపతి హెల్త్, అక్టోబర్ 15, ప్రభాతవార్త



తిరుపతి ఎస్వీ మెడికల్ ఆశాల నందు ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఐఏఎస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ కో చైర్మన్, శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, కన్వీనర్ అండ్ మెంబర్ డాక్టర్ జి ప్రమీల దేవి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ , తిరుపతి అభివృద్ధి కమిటీ మెంబర్స్ డాక్టర్ రవి ప్రభు, ఎస్ వి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ శివరాం రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డాక్టర్ ఆనంద్ మూర్తి, వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, జిల్లా వైద్య శాఖ ఆరోగ్య అధికారి లక్ష్మీపతి, కాజా మొహిద్దిన్, కరణం సందీప్, డాక్టర్ ఆర్ఆర్ రెడ్డి, సిఎస్ఆర్ఎంఓ హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలకు సంబంధించి వసతులు కల్పనలో మరియు వైద్య సేవలు మెరుగుపరచడంలో పలు కీలక విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల అభివృద్ధికి కోటి 30 లక్షల రూపాయలు అభివృద్ధి పనులకు సంబంధించి విద్యుత్ అంతరాయాల్ని నివారించడానికి జనరేటర్స్ ఆటోమేటిక్ సిస్టం ఏర్పాటు చేయడానికి 11 లక్షలు మంజూరు, ప్రస్తుత ఆస్పత్రి నుంచి రుయా ఆసుపత్రికి రోగులను తిప్పుట కొరకు ఎలక్ట్రిక్ వెహికల్ కలెక్టర్ ఫండ్స్ ద్వారా మంజూరు చేయడం జరిగింది. ప్రసూతి ఆసుపత్రి వెలుపల రోగులు యొక్క సహాయకులు కూర్చునుటకు 25 సిమెంట్ బెంచీలు ఐదు లక్షల రూపాయలు, ప్రభుత్వ ప్రకృతి వైద్యశాల ఆవరణంలో రోగుల 20 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించుటకు ఆమోదం తెలిపారు. ప్రసూతి వైద్యశాల ముందు భాగం నందు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు ఆమోదం తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసం పైనిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

సదుం అక్టోబర్ 15 ప్రభాతవార్త:మండల పరిధిలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చిందని ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు సదుం గ్రామపంచాయతీ కొత్తపల్లెకు చెందిన విజయ (45) పీలేరులోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో పనిచేస్తోంది. ఆమె భర్త చంద్రశేఖర్ గల్ఫ్ లో ఉంటున్నాడు. నిన్న మంగళవారం ఉదయం విధుల కోసం వెళ్తున్నట్లు బయలుదేరిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం విజయ మృతదేహాన్ని పుట్టావారిపల్లె బస్టాప్ సమీపంలో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే దారిలో గుర్తించిన కొందరు ఆమె కుమారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని శవ పరీక్ష కోసం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ ఎస్ ఐ సత్యనారాయణ తెలిపారు.

## అంతర్జాతీయ ఇంటర్నెట్ గేట్‌వేగా ఎపి

### - ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరురూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త:

వైజాగ్‌లో గూగుల్ భారీ ఎఐ హబ్‌ను ఏర్పాటు చేయనుండటంతో ఆంధ్రప్రదేశ్ కీలకమైన అంతర్జాతీయ ఇంటర్నెట్ గేట్ వేగా రూపాంతం చెందనుందని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. ఇక గూగుల్ సేవలకు విశాఖపట్నం కేంద్రంగా మారనుందన్నారు. ఫలితంగా దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయనుందన్నారు. ప్రధాన నరేంద్రమోడి సహకారంతో రాష్ట్రంను ప్రపంచ పటంలో నిలపడంతో పాటు సంస్కరణల రారాజుగా సిఎం చంద్రబాబునాయుడు పేరు గడించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్‌ను తీసుకువచ్చి డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా సరికొత్త అధ్యాయానికి నాంది పలకడంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కీలకపాత్ర పోషించారన్నారు. విశాఖలో ఎఐ డేటా హబ్ ఏర్పాటు కోసం ఎపి ప్రభుత్వం-గూగుల్ మధ్య ఢిల్లీలో జరిగిన ఒప్పందంను చారిత్రాత్మకమైన ఘట్టంగా ఎంపీ కొనియాడారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా ఆవిష్కరణలు, అవకాశాలకు రాష్ట్రం కేంద్ర బిందువుగా మారనుందన్నారు.

# అసలు దోషులెవరో...?

### అంతు చిక్కని డ్వాక్రా గ్రూపుల్లో అవినీతి బాగోతాలు

### తలలు పట్టుకుంటున్న కలెక్టర్, ఈస్ట్ పోలీస్ అధికారులు

### డ్వాక్రా సంఘాల బాధితులు పోలీసులకు ఫిర్యాదు



తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త

తిరుపతి అర్బన్ పరిధిలోని డ్వాక్రా సంఘాల పరిస్థితి అయోమయంగా మారుతోంది. ఎవరూ దోషులో...ఎవరు నిర్దోషులో తెలియని దయనీయ పరిస్థితి ఏర్పడిందని చెప్పక తప్పదు. కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీలోని 40 డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యుల ఆర్థిక లావాదేవీల్లో దాదాపు రూ.2 కోట్లు స్వాహా జరిగిందని నుహీరా అనే ఆర్.పి ఆ డబ్బులతో పరారైనట్లు వార్తా దినపత్రికలో సెప్టెంబరు 6వ తేది శనివారం వార్తా కథనం ప్రచురితమైన విషయం అందరికి విధితమే. ఇది ఇలా ఉండగా డ్వాక్రా సంఘాలలో జరిగిన అవినీతిపై బాధిత సభ్యులు కలెక్టర్‌ను కలిసి డ్వాక్రా గ్రూపుల్లో జరిగిన అవినీతిని బట్టబయలు చేయాలని కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో సీవో, సీఎంఎం, పీడీ, ఆర్.పిలపై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత పోలీస్‌స్టేషన్లలో దోషులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పడంలో అక్కడి నుంచి బాధిత సభ్యులు నేరుగా ఈస్ట్ పోలీసులకు వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించారు. అయితే సీవో, సీఎంఎం, పీడీలే బాధిత సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించడం, అటు పిమ్మట ఒకరిపై ఒకరు పోలీస్ అధికారుల ముందే గొడవలు పడడంతో పోలీసులు ఎవరిపై కేసులు పెట్టాలో తెలియక ఇటు కలెక్టర్, అటు ఈస్ట్ పోలీస్ అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. అసలు ఎవరు దోషులను పట్టుకోవడంలో పోలీసులకు ఎవరూ సహకరించక పోవడంతో అసలు దోషులు ఎవరు అనేది ఇప్పటికీ అంతుపట్టని ప్రశ్నగా మారింది. ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ బాధిత డ్వాక్రా సభ్యుల జీవితాలతో మెప్మా అధికారులు చెలగాటాలు ఆడుకుంటున్నారు. అసలు దోషులు ఆర్.పిలా, సీవోనా, సీఎంఎంనా, మెప్మా పీడీనా...? లేకుంటే బ్యాంకు అధికారులా ఇంత వరకు తేల్చలేని దయనీయ పరిస్థితి. అసలు బాధిత డ్వాక్రా సంఘాల సభ్యుల డబ్బులను ఆర్.పి నుహీరాను పూర్తి స్థాయిలో విచారిస్తే ఎవరెవరికి ఎంత డబ్బులు ఎవరికి ఇచ్చింది అనేది పూర్తి స్థాయిలో తేలుతుందని బాధిత సభ్యుల నుంచి వినిపిస్తున్న వాదన.. దీనిపై కూటమి, కలెక్టర్, ఎస్పీ, ఈస్ట్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి అసలైన దోషులను త్వరలో పట్టుకుని బాధిత డ్వాక్రా సంఘాల సభ్యులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# అన్నీ ఉన్నా అభ్యంతరాలే!




### -ఏళ్ళ క్రితం నాటి మృతుల సర్టిఫికేట్ అంటూపేచీ
### -సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలంటేనే దడ
### -అనువంశిక ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై అనేక నిబంధనలు

తొట్టంబేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మూడు సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాల తీరు రోజు రోజుకు తీసి కట్టుగా మారింది. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించిన శ్రీకాళహస్తి, తొట్టంబేడు, రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు దోపిడి కేంద్రాలుగా మారాయి. ఇందుకు ఉదాహరణ రేణిగుంట సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో డాక్యుమెంట్‌రైటర్లు, అటెండర్ కుమ్ములాడుకోవటం గమనించదగ్గ విషయం. ఇక తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ తీరే వేరు అన్నట్లు మారింది. ఎవరైనా అధికారితో వివరణలు కోరటానికి ప్రయత్నిస్తే అయన ఛాంబర్ వద్ద గంటల కొద్ది నిరీక్షించాలి. ఇక చరవాణి ద్వారా మాట్లాడదామంటే ఏ కార్యాలయం అధికారి కూడా తీయరు.

**అన్ని రికార్డులు పొందుపరచినా:**

తొట్టంబేడు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారి తీరే వేరబ్బా అన్నట్లు మారింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పొందుపరచిన రికార్డులన్నీ పొందుపరచినా ఏదో వంకలు పెడుతున్నారు. ముఖ్యంగా అనువంశిక ఆస్తిని పంచుకున్న తరువాత రిజిస్ట్రేషన్‌కు వెళితే గతంలో పాస్‌బుక్, 1 బిలు ఉంటే రిజిస్ట్రేషన్ చేసే వారు. అయితే ప్రస్తుతం ఉన్న అధికారి ఎందుకో కొత్త నిబంధనలంటూ పేచీ పెడుతున్నట్లు ఆరోపణలు చోటు చేసుకున్నాయి. ఆస్తులు పంచుకున్న తరువాత ఎవరి దారి వారిది. ఎక్కడెక్కడో నివాసముంటున్న, ఫ్యామిలి అందరూ హాజరు కావాలని పేచీ పెడుతున్నారని వాపోతున్నారు. ఎప్పుడో పాతికేళ్ళ క్రితం చనిపోయిన వ్యక్తి 'డెత్ సర్టిఫికేట్ తీసుకురమ్మటం' హాస్యాస్పదంగా వుంది. ఒక్కొక్క అధికారి వచ్చినపుడు ఒక్కొక్క నిబంధనతో ఇబ్బందులు కల్గిస్తున్నారు.

**ఫోన్లు తీయరు:**

ఏదైనా సమస్య వచ్చినపుడు మీడియా అధికారులను వివరణ కోరటానికి కార్యాలయానికి వెళితే అటెండర్లు సార్ బిజీగా ఉన్నారు, బయట కూర్చోండంటారు. ఇక చరవాణిలో మాట్లాడదామంటే ఎవరి ఫోన్లు తీయరు. పబ్లిక్ సర్వేంట్లుగా ఉన్న అధికారులు ఎందుకు ఫోన్లు తీయకుంటే ఎలా అని చర్చించుకుంటున్నారు. శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ అయితే పలుకే బంగారం అన్నట్లు మారారు. ఆయన ఫోన్ తీయరు, ఇదేనా సుపరిపాలన అని జనం నొచ్చుకుంటున్నారు.

## నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** జడ్పీ సమావేశభవనంలో జడ్పీ ఛైర్మన్, జడ్పీ స్థాయి సంఘాల ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ వైస్ ఛైర్మన్లు భూమిరెడ్డి ధనంజయరెడ్డి, రమ్య, జడ్పీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతిల అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటల నుండి 1 నుండి 7 వరకు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జడ్పీ సమావేశభవనంలో జరుగుతాయని జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు తెలిపారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు సంబంధిత సభ్యులు, అధికారులు హాజరై సమావేశంలో ప్రజా సమస్యలు ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఉత్సాహంగా యువజనోత్సవాలు

– సెట్విన్ సిఇఓ పి.యశ్వంత్

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**
స్వామి వివేకానంద సందేశాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉత్సాహంగా ఉల్లాసంగా యవజనోత్సవాలు విజయవంతం చేయాలని సెట్విన్ సిఇఓ పి.యశ్వంత్ పిలుపునిచ్చారు. చిత్తూరు ఆర్‌విఎస్ నగర్‌లోని ఎస్వీసెట్ కళాశాలలో బుధవారం విజయవాడ రాష్ట్ర యువజనశాఖ, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ సిఇఓ యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర యువజన సర్వీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజనోత్సవాల కార్యక్రమాలను జిల్లాలోని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేనేజర్ కె.మోహన్‌కుమార్ మాట్లాడుతూ యువ దినోత్సవ కార్యక్రమం యువతలో సృజనాత్మకత, ప్రతిభ, సమిష్టిభావం, దేశభక్తి, సామాజిక భద్రత, నాయకత్వ లక్షణాలు మెరుగుపరచడానికి దోహదపడుతుందన్నారు. సాంఘీక సంక్షేమశాఖ డిడి విక్రాంత్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానంద సందేశంను స్ఫూర్తిగా తీసుకుని యోగా, మెడిటేషన్ వంటివి ప్రతిరోజు వారి దినచర్యలో అలవరచుకోవాలన్నారు. నెహ్రు యువకేంద్రం, మేరా యువ భారత్ అధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని యువత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉత్సాహంగా, ఉల్లాసంగా యువజనోత్సవాల పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడా శాఖ అధికారి బాలాజీ, ఎస్వీసెట్ కళాశాల వైస్ ప్రిన్సిపల్, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరులో సూపర్ జిఎస్టీ అవగాహన ముగింపు కార్యక్రమం

– జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**
చిత్తూరులో ఈ నెల సూపర్ జిఎస్టీ అవగాహన ముగింపు కార్యక్రమంను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. డిఆర్‌ఓ కార్యాలయం నుండి డిఆర్‌ఓ మోహన్‌కుమార్ బుధవారం జిల్లా అధికారులకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ మాట్లాడుతూ కమర్షియల్ టాక్స్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యుడికి మేలు కలిగేలా జిఎస్టీ 2.0 ద్వారా పన్ను విధానంలో సంచాలనాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలిగేలా జిఎస్టీ శ్లాబులను సవరించడం జరిగిందన్నారు. దీనిని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌ఓ కోరారు. ఈ నెల 19వ తేదీన చిత్తూరు జ్యోతిరావ్‌పూలే భవన్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ, పరిశ్రమలు, కార్మిక, మున్సిపాల్టీ, పంచాయతీ, జిల్లా పర్యాటక, క్రీడా, విద్యుత్, వైద్య, విద్య, డిఆర్‌డిఎ, మెప్మా శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు.

## విశాఖ కేంద్రంగా గూగుల్ సేవలు

– ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరురూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌కు బ్రాండ్ అంబాసిడర్ సిఎం నారా చంద్రబా బునాయుడు అని, నాడు హైదరాబాద్‌ను సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన సిఎం నేడు విశాఖపట్నంను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఒక గిగావాట్ హైపర్‌స్కెల్ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ సంస్థలో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూగుల్ రాకతో వైజాగ్ సిటీ ఎఐ సిటీగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రానికి భారీ ఆదాయంతో పాటు యువతకు 1.88 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం చొరవతో వైజాగ్‌లో ఏర్పాటు చేయనున్న ఎఐ సిటీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందన్నారు.

## సూపర్ జిఎస్టీపై ఇంటింటి ప్రచారం



**పుత్తూరు, అక్టోబరు 15 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జిఎస్టీ స్లాబ్‌ల వల్ల ప్రజలకు చాలా ప్రయోజనం కలుగుతోందని టిడిపి నాయకులు తెలిపారు. బుధ వారం మునిసిపాలిటీలోని గేట్‌పుత్తూరు ఏడో వార్డులో పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.ధనపాల్ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టీ – సూపర్ సక్సెస్ నినాదంతో ఇంటింటికీ వెళ్లి నూతన జిఎస్టీ మార్పులతో నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో బిసి సెల్ నాయకుడు ఎం.వి.అన్బళగన్, వార్డు అధ్యక్షుడు ఎన్.ఎస్.గోపాల్,నాయకులు ఎన్.ఎం.ఆర్ముగం,చిన్నప్పన్, జయవేలన్, మోహన, అశోక్ పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలకు చక్కెర, నూనె వినియోగంపై అవగాహన

**విజయపురం, అక్టోబరు 15 ప్రభాతవార్త :**



గర్భిణీలు, బాలింతలకు చక్కెర వినియో గంపై సిడిపిఒ ఇందిర ప్రియదర్శిని అవగా హన కల్పించారు. విజయపురం ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం గర్భిణీలు, బాలింతలకు చక్కెర, నూనె వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0–3 సంవత్సరాల పిల్లలు తీసుకోవాల్సిన పోషకా హారం గురించి వివరించారు. వెయ్యి రోజుల్లో పిల్లల మెదడు చురుగ్గా అభివృద్ధి చెందుతుందని, వారిని కథలు, బొమ్మలతో ఉత్తేజపరచాలని సూచించారు. రక్తహీనత, ఊబకాయంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలన్నారు. అనంతరం పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ హరిప్రసా ద్వర్మ, సింగిల్ విండో అధ్యక్షుడు బాబు యాదవ్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది రఘు, ఎంఎల్‌హెచ్‌పి చందన, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు లక్ష్మి, శ్యామల, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టపాసులగోదాముపై దాడి: 5లక్షల టపాసులు స్వాధీనం

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 15 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తికి కూత వేటు దూరంలోని అరవకొత్తూరు గ్రామంలో బుధవారం రాత్రి అక్రమంగా నిర్వహి స్తున్న ఓ గోదాముపై దాడి చేసి రూ.5లక్షల విలువ కల్గిన బాణ సంచాను స్వాధీనం చేసుకున్నట్లు డివై యస్‌పి నరసింహామూర్తి తెలిపారు. అరవకొ త్తూ రుకు చెందిన అనిల్ అనే వ్యక్తి ఎలాంటి లైసె న్సులు, అనుమతి లేకుండా అక్రమ వ్యాపారం నిర్వహి స్తున్నట్లు గుర్తించామన్నారు. అనిల్ వాట్సాప్‌లో తక్కువ ధరలకు బాణ సంచా అందిస్తామని ప్ర చారం చేయటంతో గుర్తించి ఆకస్మికంగా దాడి చేసినట్లు డివైయస్‌పి వివరించారు. తనతో పాటు టూటౌన్ పోలీసు స్టేషన్ సిఐ నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నట్లు ఆయన వివరించారు. సుమారు రూ.5లక్షల విలువ కల్గిన సరకును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు.

## ఘనంగా శ్రీ బాలాజీ ఫ్యాషన్ జ్యువెలర్స్ ప్రారంభం



***తిరుపతి హెల్త్, అక్టోబర్ 15, ప్రభాతవార్త*** తీర్థకట్ట వీధిలోని యాదవ వీధి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జువెలర్స్ షోరూం బుధవారం ఘనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమానికి తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి షోరూంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీ సరికొత్త డిజైనర్ ఆభరణాలతో కూడిన జువెలర్స్‌ని తిరుపతి ప్రజలకు అందుబాటులోకి తేవడం సంతోషకరమన్నారు. నేడు ఆకాశాన్ని అంటుతున్న బంగారు ధరలు నేపథ్యంలో బంగారంకు ఏమాత్రం తీసుపోని ఆభరణాలను ఒక గ్రామ్ గోల్డ్‌తో సరికొత్త డిజైన్లలో దర్శనమిస్తున్నాయని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. షోరూమ్ అధినేత గిరి మాట్లాడుతూ సరికొత్త డిజైన్లతో కూడిన నాణ్యమైన నమ్మకమైన అందాన్ని రెట్టింపు చేసి స్థాయిలో తమ షోరూమ్‌లో ఆభరణాలు లభిస్తాయని తెలిపారు. రింగ్ నుంచి వడ్డానం వరకు అన్ని రకాల ఆభరణాలు తమ దగ్గర మహిళలకు లభిస్తాయని అన్నారు. అంతే కాకుండా అన్ని శుభకార్యాలకు అవసరమైన సరికొత్త ఆభరణాలు 500 నుంచి 50000 వరకు బాడుగకు అందించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దు రాయల్, సురేష్, పొన్నాల చంద్ర, ప్రవీణ్ రాయల్, కటారి మోహన్ పాల్గొన్నారు.

## సకల శాస్త్రాలకు మూలం గణితమే



***పలమనేరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త:*** సకల శాస్త్రాలకు మూలం గణితమేనని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు ప్రముఖ గణిత శాస్త్ర అవధాని అరుణ్ శివప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మహిళా పాల్ టెక్నికల్ కళాశాలలో గణితంపై అష్టావధానం నిర్వహించారు. అరుణ్‌కుమార్ అవధానిగానూ 8 మంది గణితంలో ప్రశ్నలు అడుగుతూ పృచ్ఛకులుగానూ వ్యవహరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది మంది మాత్రమే గణితంలో అవధానులుగా వ్యవహ రిస్తుండగా వీరిలో అరుణ్ శివప్రసాద్ అగ్రగణ్యులు. పృచ్ఛకులుగా యుగంధర్, చంద్రశేఖరయ్య, గిరిధర్‌తో పాటు కొందరు విద్యార్థులు కూడా వ్యవహరించారు. శ్రీపురం సీతా రామయ్య, డా.శ్రవంతి, డా.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఆర్ సావిత్రి, లెక్చరర్లు సాయిలక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు బృందావన్ విద్యార్థులు



**చిత్తూరురూరల్, అక్టోబరు 15 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, సంతపేటలోని బృందావన్ పాఠశాల విద్యార్థులు మదనపల్లి జడ్పీహైస్కూల్ నందు జరిగిన జిల్లాస్థాయి నెట్‌బాల్ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి తెలిపారు. దాదాపు 20 పాఠశాలల నుంచి 200మంది విద్యార్థులు పాల్గొనగా మా పాఠశాల విద్యార్థులు కె వైష్ణవరెడ్డి, డి. నీరజ్, విఘ్నేష్ చౌదరిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణంగా వుందని, చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మురళీ, బేబీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం

– బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్



**కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త** దేశ యువతకు స్ఫూర్తి ప్రదాత దివంగత రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ అని బిసిఎన్ గ్రూప్స్‌ఛైర్మన్ డా॥ బిసి నాగ రాజ్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ జీవితాన్ని ప్రేరణగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకుసాగాలని సూచించారు. సాధారణ పేద కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగిన కలామ్ దేశ రాష్ట్రపతిగా అత్యున్నతస్థాయికి ఎదిగారన్నారు. ఆయన నిరాడంబర జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, ఎన్ఎస్ఎస్ పిఓ మాధవన్, గంగాధర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు

## ప్రభుత్వ విప్ డా॥ కంచర్లచే కార్యాలయాల పరిశీలన

**కుప్పం,అక్టోబర్ 15 ప్రభాతవార్త**



కుప్పం పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లె క్స్, మండల పరిషత్ కార్యాలయ భవనాలను ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ కడ పి.డి. వికాస్ మర్మత్‌తో కలసి పరిశీలించారు. కడ కార్యాలయంకు వచ్చే ప్రముఖులు, ప్రజల వాహనాల పార్కింగ్‌కు సంబంధించి ఆయా ప్రాంతాలు పరిశీలిం చారు. అవసరం ఉన్న చోట్ల కొత్తగా గేట్లు ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమంలో కడ సభ్యులు రాజ్‌కుమార్,సుగుణమ్మ, వెంకీ, సతీష్ పాల్గొన్నారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి

– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



కుప్పం ప్రాంతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం గిడ్డెగానిపెంటలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు, చికిత్సలపై అవగాహనసదస్సును పశుసంవర్ధక శాఖ నిర్వహించింది. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ సిఎం చంద్రబాబు చొరవతోకుప్పంలో రోజుకు ఐదు లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అయ్యేలా చర్యలు చేపట్టారన్నారు. ఇందుకోసం పైలెట్‌ప్రాజెక్టుగా ఇదివరకే పాడిఆవులకు లింగనిర్ధారిత సీరమ్‌ను టీకాల రూపంలో వేయడం జరిగిందన్నారు. రైతులు కూడా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

## కుప్పాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చేందుకు కృషి

**కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం మున్సిపాలిటీని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చేందుకు కృషి చేస్తామని కమీషనర్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ పేర్కొన్నారు. బుధవారం కమీషనర్ ఛైర్మన్‌ను రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, కౌన్సిలర్ గణపతి, నేతలు రవి, ఎల్లప్ప ఘనంగా సత్కరించారు.సిఎం చంద్రబాబునాయుడు నుంచి స్వచ్ఛాం ధ్ర –2025 అవార్డు అందుకోవడం పట్ల వారిని అభినందించారు.

## స్వచ్ఛ శాంతిపురం సాధనే ధ్యేయం

**శాంతిపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు విజన్ మేరకు మండలంలోని అన్నిగ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా మార్చి స్వచ్ఛ శాంతి పురం మండలంగా చేయడమే తమ ధ్యేయమని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కార్యాలయంలో సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వచ్ఛ పంచాయతీ విభాగంలో స్వచ్ఛాంధ్ర 2025 అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుమాట్లాడుతూఅధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథ ంలో నడపాలన్నారు.ఈసందర్భంగా అవార్డు గ్రహీతలైన సర్పంచ్ ఎవి జయరాం, కార్యదర్శి స్వాతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలు విశ్వనాథనాయుడు, చంద్ర, రాజే ంద్ర, ఎల్.జయరాంరెడ్డి, శివశంకర్, రమేష్, నాగరాజు, రాజారెడ్డి,రాధాకృష్ణ, కోదండప ్ప, రాజేం ద్ర పాల్గొనా న్నరు.

## వర్ధికుప్పం చెరువుకు నేతలచే జలహారతి

**రామకుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



మండలంలోని వర్ధికుప్పం చెరువు కృష్ణా జలాలతో నిండి మరువ పారుతుండడం తో బుధవారం కూటమి నేతలు జల హారతి కార్యక్రమం చేపట్టారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పానికి నీళ్ల తెచ్చి మాట నిలుపుకున్నారని పేర్కొన్నా రు. కార్యక్రమం లో నేతలు వెంకట రమణ, ఆనందరెడ్డి, నరసిం హులు, చిన్నికృష్ణ, చలపతి,పత్ర నారాయణ, కృష్ణానాయక్, విశ్వనాథ్, రఫీ, కామరాజునాయక్, రామ కృష్ణప్ప, వెంకటేష్, రవిరెడ్డి,బాలు,సుబ్రి,నియాజ్ పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు సన్మానం

**చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**



మామిడి రైతులకు ఒక కేజీ మామిడిపై రూ.4 సబ్సిడీ అందించడానికి కృషి చేసిన కలెక్టర్ సుమిత్ కుమార్‌ను బుధవారం సౌత్ జోన్ ఆల్‌ఇండియా ఫుడ్ ప్రాసెసర్స్ అసోసియేషన్ ఛైర్మన్ గోవర్ధన్‌బాబీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి రైతులకు ఈ సీజన్‌లో రూ.146 కోట్లు సబ్సిడీ అందించడంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ మొత్తంను నేరుగా బ్యాంకుల వ్యక్తిగత రైతుల ఖాతాలకు జమ చేయడంతో వారికి గణనీయమైన ప్రయోజనం చేకూరిందన్నారు. అలాగే జిల్లాలో సుమారు 32 వేల మంది మామిడి రైతులు సబ్సిడీ మొత్తం పొందేలా చేయడంలో ఉద్యానశాఖ డిడి మధుసూధన్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## యూరియా కోసం రైతులు ఎదురుచూపులు

**సోమల అక్టోబర్ 15 (ప్రభాతవార్త)**

తాము పండించిన పంటలకు వేసే రసాయన ఎరువులు లభించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో వ్యక్తం చేస్తున్నారు. గతంలో రైతు భరోసా కేంద్రాల్లోనూ మరియు మార్కెట్లను యూరియా విధివిగా లభించేది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడం తో వరి సాగు రైతులు ఎక్కువగా చేపట్టారు. అలాగే పాడి పరిశ్రమపై 80 శాతం మంది రైతులు ఆధారపడడంతో వాటి గ్రాసం కోసం పశుగ్రాసం విరివిగా సాగు చేశారు, పశుగ్రాసానికి ఏరియా వేస్తేనే పెరుగుతుంది. కానీ నెల రోజులుగా యూరియా మండలంలో ఎక్కడ లభించకపోవడంతో పక్కా మండలాలలో ఎక్కువ ధరకు బ్లాక్లో యూరియా కొనాల్సి వస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ యూరియా లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని సక్రమంగా రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**సోమల అక్టోబర్ 15 (ప్రభాతవార్త)**

మండల ప్రజాపరిషత్ కార్యాలయపు సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈశ్వరయ్య తెలిపారు. సమావేశానికి అందరూ అధికారులు తమ తమ నివేదికలతో హాజరుకావాలని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. గత సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలు ప్రస్తావించడమే కాక అవి అమలు అయ్యేలా అధికారుల సహకారంతో చర్యలు తీసుకునే బాధ్యత వారు తీసుకోవాల్సి ఉంది. రైతులకు యూరియా సమస్య తీవ్రంగా ఉంది. అలాగే వర్షాలకు పలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండల కేంద్రమైన సోమలలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. 50 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు పాడైపోయాయి. అలాగే గ్రామ సచివాలయం సమీపంలో సోమల ఉప్పరపల్లి రోడ్డులో పెద్ద గోతి ఏర్పడి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. సరస్వతీపురం వద్ద కల్వర్టు ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉంది. వీటిని అధికారులు గుర్తించాల్సి ఉంది

## నిస్వార్థ భారతీయుడు అబ్దుల్ కలాం

**పుంగనూరు అక్టోబర్ 15 ప్రభాతవార్త**



అబ్దుల్ కలాం భారతదేశానికి నిస్వార్థమైన సేవలు అందించాలని ఎందరికో ఆదర్శంగా నిలిచారని బిజెపి జాతీయ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం సేవ ట్రస్ట్ వ్యవస్థాపకుడు అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఎస్వీవి జూనియర్ కళాశాలలో విద్యార్థుల మధ్య కలాం 94వ జయంతిని నిర్వహించారు. చిన్నతనం నుంచే భారతదేశానికి ఏ విధమైన సేవలందించాలనే కలలతో కలం ఇదిగారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు మాట్లాడుతూ కలం స్ఫూర్తిగా భారత దేశంలో ముస్లింలు ఎదగాలని భారతదేశానికి సేవలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు అయూబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేతు నల్లుస్వామి విజయభారతి విద్య సంస్థల అధినేత, డాక్టర్లు అజ్మతుల్లా ఖాన్, తహసీల్దార్ రాము, ఏఎస్ఐ అశ్వర్థ నారాయణ, బిజెపి నాయకులు నర్సింహులు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ పట్టణ శాఖ ఏర్పాటు

**పుంగనూరు అక్టోబర్ 15 ప్రభాతవార్త**



ఏబీవీపీ పట్టణ శాఖను బుధవారం ఎన్నుకు న్నారు. ఏబీవీపీ రాష్ట్ర సహకార దర్శి సరేంద్ర ఆధ్వర్యంలో టౌన్ కమిటీ ఎన్నిక జరిగింది. పట్టణ శాఖ అధ్యక్షుడిగా లెక్చరర్ కార్తీక్, కార్యదర్శిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా నగేష్‌ను నియమిం చారు. టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కాలేజ్ కమిటీని కూడా నియమించారు. శుభారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో హరిప్రసాద్ , కార్యదర్శిగా నిఖిల్ ఉపాధ్యక్షుడిగా రాజు నియమితులయ్యారు

## గణనాధుని సేవలో కన్నా లక్ష్మీ నారాయణ

**కాణిపాకం, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**



సత్తెనపల్లె ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. అలాగే ఆయన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రేపు చారాలలో బాలబాలికలకు కబడ్డీ పోటీలు

**చౌడేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

ఈనెల 17న పంచాయతీ కేంద్రం చారాల ఉన్నతపాఠశాలలో బాలబాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు రేణుక, పిడి రాజేంద్రబాబు, మండల కోఆర్డినేటర్ వెంకటేష్‌లు తెలిపారు. ఎస్‌జిఎఫ్ఐ క్రీడల్లో భాగంగా పలమనేరు డివిజన్‌లోని 10మండలాల్లోగల 44జట్లు పాల్గొంటాయన్నారు. అండర్–14, 17బాలబాలికల కబడ్డీ పోటీలు, ఎంపికలుంటాయన్నారు. అండర్–14బాలురు 51కిలోలు, బాలికలు 48కిలోలలోపు బరువుండాలనీ, అదే విధంగా అండర్–17 బాలబాలికలు 55కిలోలలోపు బరువుండాలన్నారు. జట్టులను తీసుకొచ్చే ట్రైనీలు, మేనేజర్లు ఫామ్–ఎ, మధ్యాహ్నభోజన సమాచారాన్ని తెలిపే పత్రాన్ని అందించాలన్నారు.

## మండలంలో 13మంది ఉపాధ్యాయులు నియామకం

**చౌడేపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**

మండలంలో 13మంది నూతనంగా ఉపాధ్యాయులు నియమితులయినట్లు ఎంఇఓ కేశవరెడ్డి తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీ ద్వారా ఈమేరకు నియామకాలు జరిగాయన్నారు. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయినట్లైంది. కాగా మరిన్ని ఏకోపాధ్యాయ బడులకు ఉపాధ్యాయులను నియమించాల్సి వుందని ఆయా విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల్లో మహిళలే అధికంగా వున్నారు.

## దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చింది అయ్యా..

– దేవలంపేట సచివాలయంలో సందడిగా దసరా మహోత్సవం

**కల్లూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



పులిచెర్ల మండలం దేవళం పేట గ్రామ సచివాలయంలో బుధవారం దసరా మహోత్సవాన్ని నాయకులు, సచివాలయ సిబ్బంది, స్థానికులు ఆనందంతో సందడిగా జరుపుకున్నారు. గ్రామ సచివాలయాన్ని మామిడి తోరణాలు అరటి మొక్కలతో అందంగా అలంకరించారు. దసరా పూజ చేశారు. వాహనాలను ముస్తాబు చేసి ఆయుధపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు, లెక్కల ధనుంజయ నాయుడు, మురళి నాయుడు, వెంకట ముని నాయుడు, స్థానికులు శివరాం, కార్యదర్శులు, సంతోష్, సురేష్, వీఆర్వో ఎల్లప్ప, డిజిటల్ అసిస్టెంట్ మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ మధు, గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీనివాసులు, సర్వేయర్ హరి, వెటర్నరీ అసిస్టెంట్ దామోదర్, ఏఎన్ఎం సరస్వతి, వీఆర్ఏ రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో మాజీ వాలంటీర్ మృతి

**పలమనేరు టౌన్, అక్టోబర్ 15, ప్రభాతవార్త:**



కర్నాటక రాష్ట్రం ముళబాగల్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలమనేరు మున్సిపాల్టీకి చెందిన మాజీ వాలంటీర్ సంతోష్ (35) మృతిచెందాడు. మున్సిపాల్టీ పరిధిలోని నీళ్ళకుంటకు చెందిన సంతోష్ బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బెంగళూరు నుండి మోటార్ సైకిల్‌పై స్వగ్రామానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. దీంతో సంతోష్ అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమితం ముళబాగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో దసరా వేడుకలు

**పలమనేరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త:**




పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన వైద్యాధికారి మమతారాణి ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో దుర్గాదేవి అమ్మవారిని వివిధ వైద్య పరకరాలు, గదులను పసుపు కుంకుమలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణ లతో ఆసుపత్రి వైద్యులు సిబ్బందితో పూజలు ఘనంగా జరిగాయి. ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందాలని మరణాల సంఖ్య తగ్గాలని, ప్రమాదాలకు గురైన వారు, రోగులు క్షేమంగా ఇళ్ళు చేరాలని ఆకాంక్షించారు.

## కాలువలో వ్యర్థాలు:హోటల్ యజమానికి జరిమానా



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త** మురుగునీటి కాలువల్లో వ్యర్థాలపై కమిషనర్ భవాని ప్రసాద్ సీరియస్‌గా ఉన్నారు. ఆయన తరచూ వేకువ జామునుంచి పట్టణంలో పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలను పరిశీలిస్తు వెను వెను వెంటనే సిబ్బందిని సమన్వయం చేస్తున్నారు. బుధవారం తేరువీధిలోని ఓ హోటల్ యజమానులు కాలువలో రాత్రి మిగిలిన సాంబారు, అన్నం, ఇతర కూరలను వేయటంతో కాలువలో నీరుపారటం ఆగిపోయింది. ఆ పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయి. ఈ పరిస్థితిని పరిశీలించిన కమిషనర్ భవాని ప్రసాద్ వెంటనే కాలువలు శుభ్రం చేసే సిబ్బందిని శానిటరీ ఇన్సె పెక్టర్ మోతీలాల్, కార్యదర్శి శైలజలను పిలిపించారు. కాలువను శుభ్రం చేయించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హోటల్ యజమానికి రూ. 5వేలు జరిమాన విధించారు. మరో సారి ఇలాంటి నిర్లక్ష్యానికి పాల్పడి పారిశుద్ధ్యానికి అంతరాయం కల్గిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాక మురుగునీటి కాలువలపై నిర్మాణాలకు సంబంధించి ఫిర్యాదులుఅందితే వెంటనే క్షేత్ర స్థాయిలో వెళ్ళి పరిశీలించి ఆక్రమణలను తొలగిస్తున్నారు.

## చియ్యవరంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే



**తొట్టంబేడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త** మండలంలోని చియ్యవరం పిహెచ్‌సి పరిధిలో బుధవారం 'గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను' ఘనంగా నిర్వహించారు. ఈ చిన్న ప్రయత్నం పెద్ద మేలు చేకూరుతుందని గ్రామ ప్రజలకు తెలియజేయటానికి విద్యార్థులచే ర్యాలి నిర్వహించారు. గ్రామంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవేంద్ర పెరిమిడి అధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన జీవితానికి ఏడు సూత్రాలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఏడు సందర్భాలలో చేతులను శుభ్రంగా పరిశుభ్రం చేసుకోవాలని ఆయన వివరించారు. పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని 'చిన్న ప్రయత్నం–పెద్ద ప్రయోజనం అంటూ నినాధాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు సుహాసిని, గంగారావు, రాజేంద్ర ప్రసాద్, సుబ్రమణ్యంలు సారధ్యంలో ఊరేగింపు జరిపారు.

## సాయిబాబా 107వ సమాధి దినోత్సవం : అన్నదానం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని కొత్తపేట కార్గిల్ సెంటర్ వద్ద బుధవారం షిరిడి సాయిబాబా 107వ సమాధి దినోత్సవం సందర్భంగా అన్నదానం జరిపారు. ఈ సందర్భంగా షిరిడి సన్నిదిలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బాబా విగ్రహానికి ప్రత్యేకాభిషేకాలతో పాటు భజనలు నిర్వహించారు. సేవా సమితి మాట్లాడుతూబాబా 1918, అక్టోబర్ 15న సమాధి అయ్యారన్నారు. నాటి నుంచి నేటి వరకు భక్తులు ఎంతో పవిత్రంగా భావించి బాబా వారిని స్మరించుకుంటూ భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహిస్తున్నారని తాము కకూడా గత 20 సంవత్సరాలుగా ఈ రోజును ఘనంగా నిర్వహిం చుకుంటూ భక్తులకు సేవలందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా కార్గిల్ సెంటర్ వినాయక ఆలయం సర్కిల్ వద్ద అన్నదానం జరిపారు. ఈ కార్యక్రమాలను జగదీశ్‌రెడ్డి, మునస్వామి, రాముగుప్తా, రాజా, జయకుమార్, సునీల్, ఏవి రమణకవ్వి, గరికపాటి రమేష్‌బాబు తద్దితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాల నుంచి ఎరువులు:దేవస్థానానికి ఆదాయం



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో లభ్యమౌతున్న వ్యర్థాల తో ఎం చక్కా ఎరువులు తయారు చేసుకోవచ్చునని పోల్యూషన్ బోర్డు చైర్మెన్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఆయన ఆలయ ఇఓ డి. బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్సె పెక్టర్ కృష్ణారెడ్డిలతో సమీక్షించారు. ఇక్కడ సేంద్రీయ ఎరువులను తయారు చేయు యంత్రాలను పరిశీలించారు. ఆలయం నుంచి వచ్చే వ్యర్థాలతో ఎంచక్కా సేంద్రీయ ఎరువులు తయారు చేసుకోవచ్చునన్నారు. దానిని దేవస్థానం పంటలకు వాడవచ్చునని అలాగే ఉద్యానవనంలోని చెట్లకు వాడవచ్చునని వివరించారు. ఆలయ పరిసరాల నుంచి ఎంత వ్యర్థాలు వస్తున్నాయి? వాటిని ఏం చేస్తున్నారు? అనే అంశానికి సంబంధించి శానిటరీ ఇన్సె పెక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని నిరుపయోగం కాకుండా ఉపయోగించుకు నేందుకు వీలుగా ఎరువులు తయారు చేసుకోవచ్చునని సూచించారు.

## చక్కటి రోడ్లు: ప్రైవేటు పార్కింగ్ వేదికలు



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో ఎంతో చక్కగా సిమెంటు రోడ్డు నిర్మించారు. అయితే అవి ట్రాఫిక్ నియంత్రణకు చక్కటి సిమెంటు రోడ్లు నిర్మిస్తే వాటి మీద ఎంచక్కా ప్రైవైటే బస్సులు పార్కింగ్ చేసుకుంటు న్నారు. దాంతో రాకపోకలకు అంతరాయం కల్గుతుంది. దీనిని గురించి పట్టించుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తున్నారు. ముఖ్యంగా ఏరియా ఆసుపత్రి రోడ్డులో కొన్ని ప్రైవేటు కంపెనీల బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (పానగల్‌లో) ఎదురుగా వరుసగా ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ జిల్లా పరిషత్ అతిధి గృహం, గ్రంధాలయం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉన్నాయి. అంతేకాక ఇక్కడ యు టర్నింగ్ ఉంది. తిరుపతి వైపు నుంచి వచ్చే బస్సులకు దారి కనబడదు. మరి అధికారులకు ప్రైవేటు బస్సుల వారితో ఏం అనుబంధమో ఏమో కానీ ఎవ్వరూ పట్టించుకోరు. దాంతో వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది.

## "తిరుపతి కథలు"కు సాహితీ పురస్కారం

**తిరుపతి, అక్టోబర్ 15ప్రభాతవార్త:**




తిరుపతి కథలు పుస్తకానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగువిశ్వవిద్యాలయం వచన రచనల్లో సాహితీ పురస్కారాన్ని తిరుపతికి చెందిన ఆచార్య పేటశ్రీకి ప్రకటించింది. 2023వ సంవత్సరంలో వచ్చిన తెలుగుసాహిత్యంలోని వివిధ ప్రక్రియలు ఉత్తమ గ్రంధాలకు తెలుగువిశ్వవిద్యాలయం ఈ పురస్కారాలను ప్రకటించింది. ఈనెల 29న హైదరాబాద్‌లోని నాంపల్లిప్రాంగణంలో ఎన్టీఆర్ కళామందిరంలో పురస్కారాలను ప్రదానం చేస్తారు. 20,116 రూపాయలు నగదును అందజేసి సత్కరిస్తారు. 2014లో పేటశ్రీ తెలుగువిశ్వవిద్యాలయం నుండి కీర్తిపురస్కారాన్ని కూడా అందుకున్నారు. ఇప్పటికీ 20 జాతీయ అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్న పేటశ్రీ దాదాపు పది దేశాల సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించారు. 25 పుస్తకాలను, 300పైగా వ్యాసాలను ప్రచురించారు.

## కనుమరుగవుతున్న పెద్దచెరువు

**పలమనేరు టౌన్, అక్టోబర్ 15, ప్రభాతవార్త:**



పలమనేరు ట్యాంక్‌బండ్‌గా పిలిచే పెద్దచెరువు క్రమంగా కనుమరుగవు తోంది. చెరువు కట్టపై రహదారి వైపు పిచ్చి మొక్కలు, పొదలు పెరిగిపోవ దంతో చెరువు ఎక్కడ ఉందో కూడా తెలియడం లేదు. పల్లవరాజుల కాలంలో పలమనేరు ప్రజల తాగునీరు సాగునీటి అవస రాలకు ఈ చెరువును నిర్మించారు. అప్పట్లో దాదాపు 150 ఎకరాల స్థలంలో ఏర్పాటైన ఈ చెరువు క్రమంగా ఆక్రమణలకు గురై కేవలం 65 ఎకరాలు మాత్రమే మిగిలి వుంది. ఉన్న చెరువు కూడా చుట్టుపక్కల ఆక్రమణలతో కుదించుకు పోయి నామమాత్రంగా ఉంది. ఒక సారి పూర్తి స్థాయిలో చెరువు నిండితే రెండేళ్ళ వరకు వర్షాలు లేక పోయినా పలమనేరు చుట్టుపక్కల ప్రాంతాల వ్యవసాయ పొలాలకు పట్టణ వాసులకు భూగర్భజలాలు పెంపొంది తాగునీటికి సాగునీటికి లోటుండదు. ఇక పలమనేరు శివార్లలో వున్న ఈ చెరువు కట్టపై చెన్నై– బెంగళూరు రహదారి ఉంది. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, చెన్నై, గుడియాత్తం, కోలారు, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఈ కట్ట మీదుగానే బస్సులు, కార్లు ఇతర వాహనాలు వెళుతుంటాయి. ఐతే పలమనేరు గంగవరం మండలాల మీదుగా నాలుగురోడ్ల నేషనల్ హైవే ఏర్పాటు కావడంతో పలమనేరు మీదుగా వచ్చే వెళ్ళే వాహనాలు దాదాపు 75 శాతం హైవే మీదుగా వెళుతున్నాయి. సాయంత్రం సమయాల్లో చెరువు గట్టుమీద నడచి వెళుతుంటే ఎంతో ఆహ్లాదంగా వుంటుంది. నాలుగేళ్ళు క్రితం చెరువు గట్టుపై పొడువునా లైట్లు వెలిగేవి. ఐతే ప్రస్తుతం ఈ లైట్లు కూడాలేక పోవడంతో బోసిపోయి చీకటి రాజ్యమేలుతోంది. ఇక పట్టించుకునే వారు లేక పోవడంతో చెరువు గట్టు పొడవునా చెట్లు పొదలు పెరిగిపోవడంతో రహదారిపై వెళ్ళే వారికి చెరువు కనిపించడంలేదు. ఇక పట్టణంలోని చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ళ అవశేషాలు గోనె సంచుల్లో తెచ్చి చెరువు పక్కనే పొదల మధ్య పడవేస్తుండడంతో కంపు గొడుతోంది. ఆహ్లాదంగా నడచి వెళ్ళేవారు కంపు భరించలేక ముక్కులు మూసుకొని వెళ్ళాల్సి వస్తోంది. ఇటీవలే పలమనేరుకు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర అవార్డు కూడా లభించింది. ఐతే ఇందుకు అనుగుణంగా అధికారులు పక్కనే ఉన్న చెరువు దుస్థితిని మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు.

## రెడ్ చెర్రీస్ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ



**తిరుపతి విద్య, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** స్థానిక రెడ్ చెర్రీస్ పాఠశాలలోని 8వ తరగతి చదువు చున్న కే. తమన్ రాష్ట్రస్థాయి గోల్బట్ బాల్ పోటీలలో అతున్నత ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల డైరక్టర్ సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ, విద్యార్థి ఉన్నత లక్ష్యాలను. అధిగమించడంలోను, పోటీలలో ఎప్పుడూ ముందు ఉండే విధంగా విద్యార్థిని తీర్చి దిద్దడంలో తమ పాఠశాల ఎప్పుడూ ముందు ఉంటుందని పాఠశాల డైరక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల పిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్

**తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 15 ప్రభాతవార్త :**



జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి మరియు శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ లో భాగంగా విస్తృత కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముందుకు సాగాలని అన్నారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి మరియు శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా డ్రైవ్ ను అక్టోబర్ 15 నుండి నవంబర్ 15 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమలలో మౌలిక సదుపాయాల ఆధునీకరణ, స్థిరమైన అభివృద్ధి చర్యలు, పరిశ్రమలు పెట్టుబడుల ప్రోత్సాహ కార్యక్రమాలు, శుభ్రత పారిశుధ్య డ్రైవ్, మొక్కల నాటే కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ చరణ్ రుద్రరాజు, నాగమల్లయ్య , రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్ప్రింగ్ డేల్ పబ్లిక్ పాఠశాలలో

### అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**తిరుపతి విద్య, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** భారత రత్న, మాజీ రాష్ట్రపతి డా. ఏ. పీ. జే. అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా స్థానిక కరకంబాడీ రోడ్డు లోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్లో తిరుపతి సిటీ ఛాంబర్ ఆధ్వ ర్యంలో అద్భుతమైన వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమం డా. కలాం ఆశయాలను, మిస్సైల్ మ్యాన్‌ఖిస్ఫూర్తిని యువతకు అందించే లక్ష్యంతో జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తూడా ఛైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు సి. దివాకర్ రెడ్డి, వైస్‌ఛాన్సలర్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఉమా వెన్నం హాజరయ్యారు. దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, కలాం చూపిన నిరాడంబర జీవితాన్ని, దేశం పట్ల ఆయన అంకితభావాన్ని గుర్తు చేశారు. "మీరందరూ ధరించిన ఈ కలాం మాస్క్‌లు కేవలం ముసుగులు కావు, భవిష్యత్తులో దేశం పట్ల మీరు వహించబోయే బాధ్యతకు చిహ్నాలు" అని వ్యాఖ్యానించారు. ప్రొఫెసర్ ఉమా వెన్నం మాట్లాడుతూ, కలాం కోరుకున్న విధంగా ఆయనను కేవలం రాష్ట్రపతిగా కాకుండా, ఒక ఉత్తమ ఉపాధ్యాయుడుగా గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరూ డా. కలాం పై తమ అభిమానాన్ని, గౌరవాన్ని చాటుతూ కలాం మాస్క్‌లు ధరించారు. విద్యార్థుల ముఖాలపై కలాం రూపాలు జాతీయ స్ఫూర్తిని, ప్రత్యేక ఆకర్షణను నింపాయి. ఈ దృశ్యం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆయుబ్ ఖాన్, కే ఎస్ వాసు స్ప్రింగ్ డేల్ స్కూల్ అధినేత, వ్యవస్థాపక కార్యదర్శి వై. షణ్ముగం, స్కూల్ ప్రిన్సిపాల్ అనురాధ, సాంబశివా రెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్లుకరుణానిధి, స్వరాజ్యాలక్ష్మి మరియు స్టాన్లీ జయకుమార్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఏపి ఇంటర్మీడియట్ ఉద్యోగుల సేవా సంఘం

### రాష్ట్ర కార్యవర్గం అధ్యక్షుడిగా ఏ. శ్రీనివాసులు



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 15, ప్రభాతవార్త** ఇంటర్మీడియట్ ఉద్యోగుల సేవా సంఘం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక గౌరవ ఏపీ ఎన్జీవో జనరల్ సెక్రెటరీ డివి రమణ ఆధ్వర్యంలో సోమ వారం గాంధీ నగర్ విజయవాడలో ఎన్జీవో హోంలో జరిగింది. రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయడంలో ఎన్నికల అధికారులుగా శ్రీ రాం ప్రసాద్, సతీష్ నాయుడు వ్యవహరించారు. నూతన ఇంటర్మీడియట్ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా అవ్వరు శ్రీనివాసులు(తిరుపతి) ఎంపిక జరిగినది. రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడంలో రాష్ట్రంలో ఉన్నటు వంటి 11 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 200 మంది బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ఉద్యోగ చట్టం అమలు చేయాలి

***తిరుపతి హెల్త్, అక్టోబర్ 15, ప్రభాతవార్త***



ప్రపంచంలో అతిపెద్ద సమస్యగా ఉన్న నిరుద్యోగ సమస్యకు ఉద్యోగ చట్టం సిద్ధాంతం అమలు ఒకటే మార్గమని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని న్యాయవాది పోతులూరి మాసుమయ్య అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యోగ చట్టం సిద్ధాంతాన్ని అమలు చేయాలని కోరుతున్న పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల్లో పుంగునూరు నియోజకవర్గంలో నుండి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళి యాదవ్ ప్రభుత్వ ఉద్యోగ చట్టం సిద్ధాంతం గురించి బీహార్ నేత తేజస్వి యాదవ్‌కు చెప్పడంతో వారు ఉద్యోగ చట్టం సిద్ధాంతాన్ని ఎన్నికల హామీలలో ఏర్పాటు చేసుకొని, అధికారంలోకి వచ్చాక ప్రతి నిరుద్యోగికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. వారు ఎన్నికలలో గెలుపొందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, విక్రమ్ రాథోడ్, రాజు, సౌందర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధ పూజ : అవగాహన సదస్సు



***శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త*** రాష్ట్రీయ సేవా సమితి పొదుపు సంఘాల కార్యాలయంలో బుధవారం అయుధ పూజలు ఘనంగా జరిపారు. అలాగే సలహాకమిటి లీడర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. పొదుపు సంఘాల సంచాలకులు వి. నాగరాజు అధ్యక్షతన కమిటి లీడర్లకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సభ్యుల శ్రేయస్సే లక్ష్యంగా రాస్ పని చేస్తుందన్నారు. నేడు మహిళల పొదుపు సమాజాభివద్ధికి ఎంతో దోహద పడుతుందన్నారు. లీడర్లు మంచి సేవా ధృక్పథం, బాధ్యత, మంచి నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు కలిగి సమాజాభివృద్ధికి దోహద పడాలన్నారు. రాస్ ద్వారా సభ్యులందరికి ఉచిత నైపుణ్యాశిక్షణ ద్వారా వారి కుటుంబాల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో అన్ని క్లస్టర్ లీడర్లు జి. వెంకటేశ్ కరునాకర్ రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 15 ప్రభాతవార్త**



ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తాము కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి పిలుపు మేరకు తాము గ్రామ గ్రామానికి వెళ్ళి కేంద్రం లో బిజెపి ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్న మాయా జాలాన్ని వివరిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని వివరిం చారు. ఓట్‌చోర్ గద్దె చోడ్ కు ప్రజలు స్వచ్ఛంగా సంతకాలు చేస్తున్నారన్నారు. బుధవారం ఏర్పేడు మండలం పల్లంపేట గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరం రెడ్డితో పాటుజిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోని, మండల యువజన అధ్యక్షులు నవీన్, చరణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పరశురామేశ్వర్లుని సేవలో మెడికల్ ఆఫీసర్



**శ్రీకాళహస్తిరూరల్, అక్టోబర్ 15 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో బుధవారం విజయ వాడకు చెందిన సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. ఉషారాణి కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఈ దివ్యక్షేత్రం ప్రాశస్త్యం తెలుసుకున్న అధికారులు స్వామి వారిని దర్శించుకొనుటకు వస్తున్నారు. ఆలయాభి వృద్దికి మాజీ చైర్మెన్ బత్తల గిరినాయుడు, ఇఓ రామచంద్రారెడ్డిలు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళుతు న్నారు. వారి చొరవకుస్థానిక శాసనసభ్యుడు బబొజ్జల వెంటకటసుధీర్‌రెడ్డి సహకరిస్తు న్నారు. డాక్టర్ ఉషారాణికి స్వాగతంపలికిదర్శనానంతరంవేదపండితులతో ప్రత్యేకాశీర్వచనంతో పాటు తీర్థ ప్రసాదాలు అందించారు.

# తిరుపతి డివిజన్

## నేడు మండల సర్వసభ్య సమావేశం : ఎంపిడిఓ

**నారాయణవనం, అక్టోబర్ 15 ప్రభాతవార్త :**

నారాయణవనం మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపిపి పి దివాకర్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఓ అరుణ తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులందరు పాల్గొనాలని కోరారు.

## ఇప్పతాంగేల్ గ్రామంలో వైద్యశిబిరం

–వార్త కథనానికి స్పందన



**నారాయణవనం, అక్టోబర్ 15 ప్రభాతవార్త :** మండలంలోని కశిమిట్ట పంచాయతీ ఇప్పతాంగేల్ గ్రామంలో బుధవారం ఉదయం వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని అందించి వైద్య సేవలను అందించారు. బుధవారం వార్త దినపత్రికలో ఇప్పతాంగల్‌లో రోగాల భారిన ప్రజలు అనే శీర్షికతో వార్త కథనం ప్రచురించిన విషయం విధితమే. మండల వైద్యాధికారులు ఈ కథనానికి స్పందించి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో 12మందికి వ్యాధి సోకినట్టు గుర్తించారు. వీరిలో జ్వరం భారిన పడిన వారు వున్నారు. వీరికి చికిత్స అందించిన తర్వాత మందులను అందించారు. వ్యాధి తీవ్రమైతే ఆస్పత్రికి రావాలని కోరారు. అనంతరం గ్రామంలో మురికికాలువలను శుభ్రం చేయడం, నీటి నిల్వలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ హరినాథ్, సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌బాబు, యశోద, వరలక్ష్మీ, సుధాకర్, నవనీత, పంచాయతీ కార్యదర్శి లీలావతి, ఎంఎల్‌హెచ్పిఎస్, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీధర్‌కు ఘనసన్మానం

**రేణిగుంట అక్టోబర్ 15 ప్రభాతవార్త**




ఏఐ ఆర్‌ఆర్‌ఎఫ్ (ఆల్ ఇండియా రైల్వే విశ్రాంత ఉద్యోగుల ఫెడరేషన్) , ఎస్సీ ఓబీఏ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులుగా ప్రజా ఫిర్యాదులు పెన్షన్స్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు మేరకు రెండు సంవత్సరాలు పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు అందుకున్న శ్రీధర్‌ను సిఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్మికులకు నిరంతర సేవలు అందిస్తున్న శ్రీధర్ తిరిగి పదవులకు నామినేట్ కావడం అభినందనీయమని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్ఎం విజయ్ కుమార్ అభినందించారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో రైతులకు కార్డులు పంపిణీ.

**రేణిగుంట అక్టోబర్ 15 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలోని పలువురు రైతులకు బుధవారం యూరియా కు సంబంధించి కార్డులను సింగిల్ విండో చైర్మన్ వీరాపురం భాస్కర్ రెడ్డి పంపిణీ చేశారు. రైతులకు యూరియా పంపిణీ సులభతరం చేయడం కోసం వెంకటాపురం, అన్నసంపల్లి, ఆర్ అగ్రహారం గ్రామాల రైతులకు కార్డులు పంపిణీ చేశామని భాస్కర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ సునీల్ కుమార్, పద్మ శేఖర్, టిడిపి నేతలు మాజీ ఎంపీటీసీ గజేంద్ర రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, కృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి, రామ్ రాజ్ సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

## ఉమెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ విజేతగా జి. అఖిల సాయి

**తిరుపతి క్రీడ, అక్టోబర్ 15, ప్రభాతవార్త**



శ్రీ వెంకటేశ్వర ఇంటర్ కాలేజ్ శ్రీ వెంకటేశ్వర ఇంటర్ కాలేజ్ ఉమెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ విజేతగా నిలిచిన జి. అఖిల సాయి సింగిల్స్‌లో డబుల్స్‌లో ప్రథమ బహుమతి సాధించింది. ఇంజనీరింగ్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ఎస్ వి యూనివర్సిటీ డైరెక్టర్ శివశంకర్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఇందులో ఎస్‌వి యూనివర్సిటీ కాలేజీకి సంబంధించి 12 కాలేజీలు ఉమెన్స్ డిగ్రీ కలేజీలో పార్టిసిపేషన్ చేసారు.

## ఆనందగిరి కొండలపై సీడ్ బాల్స్ చల్లిన విద్యార్థినులు

**పాకాల, అక్టోబర్ 14, ప్రభాతవార్త**



పాకాల మండలం ఉప్పర పల్లె పంచాయతీలోని ఆనందగిరుల పై పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రిన్సిపాల్ రెడ్డి రామరాజు, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల సహకారంతో లైన్స్ క్లబ్ పాకాల ప్లాటినం వారి ఆధ్వర్యంలో దాదాపు 2000 సీడ్ బాల్స్ ను ఊట్లవారిపల్లి సమీపన గల ఆనందగిరి కొండలపై చల్లడం జరిగినది. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు కేఎన్ తులసిరామన్, రీజనల్ చైర్పర్సన్ జి రామయ్య, అధ్యాపకులు రమేష్ నాయుడు, రూపేష్ రెడ్డి ప్రతాప్, ఎన్ఎస్ఎస్ విద్యార్థునులు పాల్గొన్నారు.

## ఎదిగేకొద్దీ ఒదిగిన వ్యక్తిత్వం "డాక్టర్ అబ్దుల్‌కలాం"

ఎంఈఓ శ్రీవరం లలితకుమారి

**చంద్రగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**



ఉన్నత స్థాయికి ఎదుగుతున్న కొద్దీ మరింత ఒదిగిన వ్యక్తిత్వం భారతరత్న దివంగత డాక్టర్ అబ్దుల్‌కలాందని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. స్థానిక శ్రీపద్మావతీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలామ్ జయంతిని పురస్కరించుకుని గతంలో వే ఫౌండేషన్ అధినేత డాక్టర్ పైడి అంకయ్య ఏర్పాటు చేసిన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి యావత్ ప్రపంచంచే మిస్సైల్‌మెన్‌గా గౌరవించబడిన గొప్పశాస్త్రవేత అని కొనియాడారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం యువత విద్య, క్రీడలు వంటి రంగాలలో రాణించాలన్నారు. సమాజాన్ని పీడిస్తున్న మాదకద్రవ్యాలను తుదముట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ రెడ్డి, ఇంపాక్ట్ రీజినల్ క్లబ్ ప్రెసిడెంట్ తహసున్నిసా బేగం, ట్రైనర్ మాదవి, నల్లం సురేంద్ర, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కేసు నమోదు .. రైల్వే పోలీసుల దర్యాప్తు



**చంద్రగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త:** చంద్రగిరి రైల్వే పోలీస్ స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (65) మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి (పురుషుడు) మృతదేహం పడివున్నట్లు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. మృతుడు తెలుపు రంగు షర్టు, షర్ట్‌పై బ్లూ, రెడ్ కలర్ గీతలు కలిగినవి ధరించివున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాణాసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి

**రామచంద్రాపురం, అక్టోబర్ 15 ప్రభాతవార్త:**



బాణాసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి పొందాలని ఎస్ఐ భక్తవత్సలం అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లైసెన్స్‌దారులే భాణాసంఛా విక్రయించాలన్నారు. తల్లి దండ్రుల పర్యవేక్షణలోనే పిల్లలు టపాకాయలు పేల్చే విధంగా చూసు కోవాలని అన్నారు. ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై ప్రత్యేక నిఘా వుంటుందని హెచ్చరించారు.

## కలాం జీవితం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకం



**తిరుపతి, అక్టోబర్ 15ప్రభాతవార్త:** మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని బిజెపి నాయకులు తెలిపారు. మిస్సైల్‌మేన్ కలాం అని, ఆయన జీవితం శాస్త్రవేత్తలకు ఆదర్శమన్నారు. చిన్నతనంలోనే అనేక కష్టాలను అనుభవించి ఉన్నత చదువులు అభ్యసించారని ,ఉపగ్రహాల తయారీలో కలాం పాత్ర కీలకమన్నారు. అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను బుదవారం ఉదయం తిరుపతి బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, తమ్మిశెట్టి చంద్రశేఖర్, జయంత్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, గుర్నాథ్, కృష్ణ, వాసు, సురేష్‌స్వామి, కెఎన్‌రాజ, బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డి తదితరులు కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## మిస్సైల్ మెన్ 94వ జయంతి వేడుకలు






గూడూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్, బిజెపి రాష్ట్ర మాజీ మైనార్టీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో డిఆర్ డబ్ల్యు కాలేజీలో మీటింగ్ హాల్లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డిఆర్ డబ్ల్యు కాలేజ్ డిగ్రీ, ఇంటర్ విద్యార్థులతో అబ్దుల్ కలాం గురించి ప్రత్యేక ప్రసంగ పోటీలు, వ్యాసరచనలు, అబ్దుల్ కలాం డయాగ్రమ్స్ నిర్వహించారు. అలాగే గూడూర్ డిప్యూటీ సూపరెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ గీత కుమారి విద్యార్థులకు బాధ్యతలను గురించి తెలిపారు. డాక్టర్ తాజుద్దీన్ మాట్లాడుతూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎప్పటికీ భారతీయుల హృదయాల్లో చిరస్థాయిగా బ్రతికే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సబద్యక్షులు అరవపార్వతయ్య, ముఖ్య అతిథులు ఏఈ పి.హనుమంతరావు డిఆర్‌డబ్ల్యు కాలేజ్ ప్రిన్సిపాల్ గూడూరు, డిఆర్ డబ్ల్యు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సురేష్, పాస్ అధ్యక్షులు దగ్గోలు సురేంద్రబాబు, రిటైర్డ్ జైలర్ వై శ్రీనివాసులు యాదవ్, కాలేజ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ ప్రోత్సాహిత్-2025




గూడూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: గూడూరు లోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులలో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, పరిశోధనాత్మక దృక్పథాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మినీ ప్రాజెక్ట్ ఎక్స్పో పోటీ నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్పోలో వివిధ కళాశాల నుంచి, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల నుంచి 1800 మంది విద్యార్థులు పాల్గొని 480 ప్రాజెక్ట్స్ పెట్టారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్పోకి ముఖ్యఅతిథిగా పి.కె.కృష్ణ ప్రసాద్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) డిఎస్ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కృష్ణ ప్రసాద్ విద్యార్థులతో మాట్లాడుతూ పలు ప్రాజెక్ట్స్ గురించి తెలియజేస్తూ వారిని ఇంకా కొత్త ప్రాజెక్ట్స్ చేసేట్లు ప్రోత్సహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రవి ప్రసాద్ విద్యార్థులతో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. డీన్ డా.విశ్వక్సేనరెడ్డి ఈ కార్యక్రమం విద్యార్థులకు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకునే అవకాశం కల్పించడమే కాకుండా, కొత్త ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందని తెలియజేసారు. డైరెక్టర్ డా.దత్తాత్రేయ శర్మ, కృష్ణ ప్రసాద్ ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు అందజేసారు. ఈ ప్రోగ్రాంలో విద్యార్థులకు అవసరమైన టువంటి ఏర్పాట్లు సౌకర్యాలు నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాజెక్ట్ ఎక్స్పో కన్వీనర్ శివకుమార్, ఏవో కొండారెడ్డి, కళాశాల సిబ్బంది ఏర్పాటు చేశారు.

# గూడూరు డివిజన్

## శ్రీభారతీ ట్రస్టు సేవలు అభినందనీయం

### - ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కోట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: కుల మతాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విద్యావికాస్ కేంద్రాలను శ్రీ భారతి ట్రస్టు నిర్వహించడం పట్ల మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అభినందించారు. కోటకు చెందిన శ్రీభారతీ ట్రస్టు ఛైర్మన్ కోటేశ్వరరావు బుధవారం హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. కోటేశ్వరరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే కోట, వాకాడు మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో మూడు విద్యావికాస్ కేంద్రాలను ప్రారంభించామని, ఈ నెలలో మరో రెండు పాఠశాలలను ప్రారంభించనున్నట్లు వెంకయ్యనాయుడికి వివరించారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం, పర్యావరణం, రైతువికాసం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, మహిళా సాధికారత, మహిళల ఆర్థికాభివృద్ధి అంశాలపై తమ ట్రస్టు పనిచేస్తుందని తెలిపారు. వెంకయ్యనాయుడు కోట ప్రాంతానికి వస్తానని చెప్పారని కోటేశ్వరరావు తెలిపారు.

## రేకుల షెడ్డు నుంచి జారి పడిన వ్యక్తి మృతి!

చిల్లకూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు రేకుల షెడ్డు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిల్లకూరు గ్రామంలోని సత్యంజి లేఅవుట్ నందు బుధవారం చోటు చేసుకుంది. నెల్లూరు టౌన్ పద్మశాలి వెంకటేశ్వరపురంకు చెందిన కటకం రంగయ్య కుమారుడు కటకం శ్రీహరి (27) చిల్లకూరు గ్రామంలోని సత్యం జి లేఅవుట్ ముందు లక్ష్మీనారాయణ నిర్మిస్తున్న రేకుల షెడ్డు వద్ద పనిచేస్తుండగా మధ్యాహ్నం సమయంలో రేకుల షెడ్డుపై నుండి ప్రమాదవశాత్తు జారీ క్రిందపడి మృతి చెందాడని తెలిపారు.

## ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి

సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా సైన్స్ ప్రాజెక్టుల నమూనాలను ఏర్పాటు చేశారు. వాటిలో నాలుగు ప్రాజెక్టులను ఉత్తమమైనవిగా ఎంపిక చేసి అవార్డులు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ సంబంధిత విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్.శ్రీనివాసులు, శ్యాంసుందర్, దుష్యంత్, ఉప కార్యదర్శి ఉస్మాన్‌బాషా, శ్రీకుమార్‌రెడ్డి, నాగేంద్ర, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ శ్యామ్, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసులురెడ్డి, తేరే వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత అలవరచుకోవాలి : ఎంపిడిఓ



కోట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపిడిఓ దిలీప్‌కుమార్ కోరారు. బుధవారం కోట మండలం జరుగుమల్లి గ్రామంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులు పరిశుభ్రంగా లేకపోతే క్రిములు, బ్యాక్టీరియా, వైరస్ వలన మనం తీసుకునే ఆహారం మన శరీరంలోకి వెళుతుందని తద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు విద్యార్థులకు భోజనానికి ముందు చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు.

## క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి నడవడిక అలవరచుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అన్నారు. బుధవారం శ్రీగోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ర్యాగింగ్, సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గోకులకృష్ణ కళాశాల యాజమాన్యానికి సంబంధించి బ్రహ్మయ్య, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ బాలగాని పవన్‌కుమార్, ఎఓ గుర్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా : ఎఎంసి ఛైర్మన్



కోట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: రైతులకు కావలసిన యూరియా అందుబాటులో ఉందని వాకాడు ఎఎంసి ఛైర్మన్ దారా ప్రమీల అన్నారు. బుధవారం కోటలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా కార్డులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమీల మాట్లాడుతూ 341 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఈ సీజన్‌లో యూరియా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, మధుయాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఎంపిటిసిలు షంషుద్దీన్, సురేష్, మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా కాల్చడంలో జాగ్రత్తలు పాటించాలి:ఆర్డీఓ



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ప్రజలు బాణాసంచా కాల్చడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి సూచించారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి దొరవారిసత్రం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ఫైర్, రెవెన్యూ, బాణాసంచా దుకాణాల యజమానులతో సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. బాణాసంచాను విక్రయించేవారు తమ షాపుల ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీరు, ఇసుక సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి దీపావళి సంబరాల్లో ఎలాంటి అపశృతి చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, అగ్నిమాపకదళ అధికారులు పాల్గొన్నారు.

## సూపర్ జీఎస్టీ ద్వారా... పేదలకు సూపర్ సేవింగ్స్



బాలాయపల్లి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: సూపర్ జిఎస్టి ద్వారా పేదలకు ఎంతగానో మేలు జరుగుతున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. బాలాయపల్లిలోని టిడిపి కార్యాలయం నుండి బస్టాండ్ ప్రాంగణం వరకు జీఎస్టీ 2.0పై టిడిపి శ్రేణులు అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రతి దుకాణం దగ్గరకు వెళ్లి సూపర్ జీఎస్టీసూపర్ సేవింగ్ కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమంను మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు జడపల్లి కోటేశ్వర గౌడ్, వెంకటేశ్వర్లు, శేషమ నాయుడు ఇంకా పలువురు నేతలు నిర్వహించారు. ఈ ర్యాలీలో టిడిపి నేతలు జడపల్లి కోటేశ్వర గౌడ్, వెంకటేశ్వర్లు, శేషమ నాయుడు, వెంకటాద్రి, కూని శ్రీహరి, ప్రసాద్ నాయుడు, మాధవయ్య నాయుడు, గోపాల్ యాదవ్, గరిటయ్యలు పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని సూళ్లూరుపేటలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు కె.సాయిబాబా ఆధ్వర్యంలో సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ డెమో నిర్వహించారు. ప్రక్రియ చేపట్టాలనే అంశాలపై విద్యార్థులకు డాక్టర్ సాయిబాబా వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యులు దువ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, నాగేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ ఆదినారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ రాజా ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దీపావళి కానుకలు



సూళ్లూరుపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సాయినగర్ పాఠశాల విద్యార్థులకు నూతన దుస్తులు, టపాసులను బుధవారం అందజేశారు. ఎంఇఓ కె.సునీల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలచంద్రశేఖర్, ఉపాధ్యాయులు సుజాత, ఉషారాణి, ఆర్ఎంబి భాస్కర్‌బాబు, రిటైర్డ్ టీచర్ మురళీ, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## విక్రయదారులు నిబంధనలు పాటించాలి: సీఐ

వెంకటగిరి, అక్టోబర్ 15 ప్రభాతవార్త: బాణసంచా విక్రయిదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సిఐ ఏవి రమణ తెలిపారు. ఈనెల 20వ తేదీ దీపావళి సందర్భంగా టపాసులు దుకాణాలను ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న విశ్వదయకాలేజీ గ్రౌండ్లో అందరూ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పార్టీ కోసం కష్టపడిన వారికి మొండిచెయ్యి!



నారాయణవనం, అక్టోబర్ 15 ప్రభాతవార్త : 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకుండా ఓటమికి పని చేసిన వారికి పదవులను ఇవ్వడం ఎంత వరకు న్యాయమని తెలుగుదేశం పార్టీ నాయకులు విలేఖరుల సమావేశంలో ఖండించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లు ఎన్నికలకు ముందు టిడిపి కోసం కష్టపడి పని చేసిన వారికి తప్పక న్యాయం చేస్తామని, పార్టీకి వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసే వారి పట్ల చర్యలు తప్పని హెచ్చరించారు. అయినా సత్యవేడు నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన కోనేటి ఆదిమూలంకు ఓటు వేయకుండా టిడిపి రెబెల్ అభ్యర్థి యాతాటి రమేష్‌బాబు పోటీ చేసిన చెరుకు గుర్తుకు పనిచేసి కోట్ల రూపాయాలను పంచిన వారికి నామినేటెడ్ పదవులను ఎలా కట్టబెడతారని మండిపడ్డారు. నారాయణవనం మండలం అరణ్యకండ్రిగ పంచాయతీలో ప్రసిద్ధి చెందిన దేవాదాయశాఖకు చెందిన కామాక్షాంభిగా సమేత కైలాసనాధకోన ట్రస్టు భోర్డులో టిడిపికి వెన్నుపోటు పొడిచిన వారికే పదవులను కట్టబెట్టడాన్ని చూస్తే ఆశ్చర్యం వేస్తోందన్నారు. సత్యవేడు టిడిపి ఎమ్మెల్యే ఆదిమూలం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పదవిని యాదవ కులానికి చెందిన శ్రీనివాసయాదవ్(వాసు) పేరును ప్రతిపాదించారు. అయితే టిడిపి ఓటమికి పని చేసిన వారికి పదవులను ఇవ్వడం అన్యాయమన్నారు. కొత్తగా సత్యవేడు నియోజకవర్గ ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన కూరపాటి శంకర్‌రెడ్డి టిడిపి పార్టీకి ద్రోహం చేసిన వారిని దగ్గర చేరుకొని కష్టపడి పని చేసిన వారిని పక్కన పెట్టడం పట్ల వ్యతిరేకత ఎక్కువవుతున్నట్టు గుర్తు చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపిపి, సీనియర్ టిడిపి నాయకులు పి గోవిందస్వామి, మాజీ ఎంపిపి పి భక్తవత్సలం, సర్పంచులు రమేస్‌బాబు, డి ఆరుముగం, మాజీ సర్పంచులు కెఎస్‌రవి, కె సుధాబాబు, శంకరయ్య, మాజీ డిసిసిబి డైరెక్టర్ టి ఊరప్ప, నాయకులు బిఎం నరేష్, వి రఘుపతిరెడ్డి, నాగరాజు, గోవిందశెట్టి, ఎరికంబట్టు మురళి, వి సుబ్రమణ్యం, కె నాగయ్య, పిజి ముఖేష్, ఎన్ రమేష్, దేవరాజులు, కుట్టి బాలయ్య, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర ఆదాయాన్ని సమకూర్చుకోవాలి : ఎంపీడీవో



వాకాడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పంచాయతీలలో సుస్థిర ఆదాయా వనరులను సమకూర్చుకోవాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణం స్త్రీ శక్తి భవనంలో చివరి రోజు సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయితీ పరిధిలో ఉన్న ఆదాయ వనరులను పెంపొందించుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సురేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి, సర్పంచులు నల్లారెడ్డి అనిల్ కుమార్ రెడ్డి, మల్లాపు నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయంను తనిఖీ చేసిన ఎంపీడీవో

వాకాడు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలో వున్నా సచివాలయంను మంగళవారం ఎంపీడీవో సాయిప్రసాద్ తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు, సంబంధించిన సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందజేశారు. అత్యవసరమైన సమయంలో మూమెంట్ రిజిస్టర్‌లో తెలపాలన్నారు. ఎంపీడీవో వెంట సచివాలయం సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

## తపాలా ఉద్యోగుల ఒక్క రోజు ధర్నా

గూడూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: హెడ్ పోస్టు ఆఫీస్ జిడిఎస్‌లని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి అనే నినాదంతో మన హక్కుల కోసం పోరాడినందుకు ఎస్ఎస్. మహాదేవయ్యని సర్వీస్ నుండి తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం డివిజనల్ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ కామ్రేడ్, బి.గోపాల్, సర్కిల్ అసిస్టెంట్ ట్రెజరెర్ కాం. మల్లిఖార్జున, పెన్షనర్ సెక్రటరీ కె.సుధాకర్, సిహెచ్ సుబ్బారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పెళ్లకూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త : పెళ్లకూరులోని స్థానికంగా ఉన్న 71 వ నెంబర్ జాతీయ రహదారి ఫ్లైఓవర్ పై బుధవారం సాయంకాలం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎన్. అన్నారెడ్డి(55) అనే వ్యక్తి ప్రమాదానికి గురికావడంతో అతని కుడికాలు నుజ్జునుజ్జు అయ్యింది. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం ఎన్ అన్నారెడ్డి ది రేణిగుంట దగ్గర ఉన్న వెంకటరెడ్డిపల్లి కాగా, నాయుడు పేటలో ఉన్న తమ కుమార్తె దగ్గరికి వచ్చి తిరుగు ప్రయాణంలో రేణిగుంటకు వెళుతుండగా ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్ క్షతగాత్రున్ని నాయుడుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

## నవ్యాంధ్ర గేమ్ ఛేంజర్ గూగుల్ సంస్థ : ప్రభుత్వ విప్



కుప్పం, అక్టోబర్ 15 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌ల చొరవతో రాష్ట్రానికి వచ్చిన గూగుల్ క్లౌడ్ సంస్థ నవ్యాంధ్ర గేమ్ ఛేంజర్ అని ప్రభుత్వ విప్,కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్,మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ సభ్యులు రాజ్‌కుమార్, సుగుణ మ్మ, రామచంద్ర, సతీష్, వెంకీ, పార్టీ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, రాజగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్ తదితరులతో కలసి మాట్లాడారు. ఐదేళ్ల వైఎస్సార్సీపాలనలో జరిగింది విధ్వంసమేనన్నారు. రాష్ట్రం నుంచి లూలూ, ఫ్లా ఒక్టిన్ టెంపుల్టన్, ఏషియన్ పల్ప్ కంపెనీ తదితరాలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. అన్ని విధాలా నష్టపోయిన ఎపిని మరలా సిఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి వైపు తీసుకెళ్త ఒంటే మాజీ సిఎం జగన్, వైఎస్సార్సీశ్రేణులు విషం కక్కడం భావ్యం కాదన్నారు. రాజధాని అమరావతి నగర నిర్మాణం సైతం వేగంగా జరుగుతోందన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ గూగుల్ సంస్థ ఎపి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర ప్రజలుకూడా సుస్థిరపాలనకు మద్దతు పలకాలన్నారు. సమావేశంలో నేతలు అప్పు, మహేంద్ర, శరవణ, వసంతమ్మ,ఇర్ఫాన్, వాసు, హేమాంబర గౌడు తదితరులుపాల్గొన్నారు.

## జాతీయ రహదారులు పనులను వేగవంతం : జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 15. ప్రభాతవార్త : 205 జాతీయ రహదారులకు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జాతీయ రహదారులకు పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై తిరుపతి, చెన్నై నేషనల్ హైవే పిడిలు, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి సంబంధిత మండలాల తహశీల్దార్లు తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 205 జాతీయ రహదారుల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్న మల్లవరం, పుత్తూరు తిరుచానూరు, తూకివాకం, గాజుల మాన్నెద్య, వడమాలపేట మండలాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ జాతీయ రహదారులు పిడిలు, రెవెన్యూ అధికారులతో కలిసి జాతీయ రహదారుల పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే పిడి చెన్నై రవీంద్రరావు, జిల్లా మైన్స్ అధికారి బాలాజీ నాయక్, తహశీల్దారులు, వీఆర్వోలు, జాతీయ రహదారుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన జిల్లా జేశాప్ క్రికెట్ జట్టు



తిరుపతి క్రీడ, అక్టోబర్ 15 ప్రభాతవార్త: జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జేశాప్) తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు బుధవారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ 2025 విజేతగా నిలిచిన ఉమ్మడి తిరుపతి, చిత్తూరు జిల్లా జట్టను అభినందించారు. టోర్నీలో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పాల్గొన్న 16 జట్లలో తిరుపతి జిల్లా జట్టు ఛాంపియన్స్‌గా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి హరిబాబు, జిల్లా జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, క్రీడాకారులు మనోహర్, జగదీష్, సురేష్, శేఖర్, తుకారం, సతీష్,శ్రీనివాసులు, సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి : ఉపకులపతి



రేణిగుంట అక్టోబర్ 15 ప్రభాతవార్త: వ్యవసాయంలో కొత్త పద్ధతులను అవలంబించడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి జేవీ రమణ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు (ఆత్మ) బుధవారం కిసాన్ మేళా జరిగింది ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ జేవి రమణ మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశంగా అభివర్ణించారు. కార్యక్రమంలో పశు వైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సంచాలకు డాక్టర్ సుమతి, ప్రాంతీయ పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ రూత్, తిరుపతి జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, చిత్తూరు జిల్లా ఉద్యాన అధికారి దశరథ రామిరెడ్డి, ఆత్మ పథక ఉపసంచాలకులు రామాంజనేయులు, చిత్తూరు జిల్లా ఉద్యానవనాధికారి దశరథ రామిరెడ్డి, చిత్తూరు డాట్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణారావు, ప్రకృతి వ్యవసాయ పథక మేనేజర్ షణ్ముగం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఠాగూర్, డాక్టర్ కదిరి మోహన్, డాక్టర్ విశ్వనాథ్, జిల్లా వనరుల కేంద్రం ప్రతినిధి సౌభాగ్య లక్ష్మి, వేణుగోపాల్, శ్రీనివాసులు, సూక్ష్మ నీటి పారుదల శాఖ పథకం అధికారులు పాల్గొనగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు రాము కుమార్, తదితరుల పరిరక్షణలో కిసాన్ మేళ విజయవంతంగా జరిగింది.

## రెండు వాహనాలతో సహా... ఎర్రచందనం పట్టివేత



భాకరాపేట, అక్టోబర్ 15 ప్రభాతవార్త : భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ వెంకట రమణకు అందిన రహస్య సమాచారం మేరకు అప్రమత్తమై సిబ్బందితో కలిసి మాటు వేయగా బోడేవాండ్లపల్లి పరిసరాలలో మంగళవారం ఒక తవేరా వాహనం పట్టుపడగా అందులో పది ఎర్రచందనం ఉన్నవి. అలాగే బుధవారం ఉదయం చిన్నగొట్టిగల్లు పంచాయతీ వలసారెడ్డి గారి పల్లి సమీపంలో ఒక కారు పట్టుపడగా అందులో ఐదు దుంగలు గుర్తించామన్నారు. దుంగలు, వాహనాల విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందన్నారు. కాగా మమ్మల్ని చూసి స్మగ్లర్లు పారిపోయారని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సిబ్బంది బీట్ ఆఫీసర్‌లు రాజేష్, సదాశివయ్య, ప్రదీప్చంద్, రవి, నిఖిల్, మరియు శంకర్, రోహిత్ పాల్గొన్నారు.

## నూతన వెటర్నరీ డీన్, డీఎస్‌ఏలకి ఘన సన్మానం



తిరుపతి విద్య, అక్టోబర్ 15 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర పశు వైద్యవిశ్వ విద్యాలయంలో నూతనంగా పశువైద్య విశ్వ విద్యాలయం డీన్‌గా బాధ్యతలుగా స్వీకరించనటువంటి ప్రొ.ఆర్.వి. సురేష్ కుమార్‌ని, విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్‌గా బాధతలు స్వీకరించి నటువంటి ప్రొ.వైకుంత రావుని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు అద్వర్యంలో ఘనంగా దుశ్శాలువ తో వెటర్నరీ పరిపాలన భవనంలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాయలసీమ బీసీ విభాగం అధ్యక్షులు విజయ్,గిరి నాయక్, ముస్తఫా,చిద్విలాస్ పార్థసారథి, ధనుంజ యులు, మధు ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో పోల్యూషన్ బోర్డు ఛైర్మెన్



శ్రీకాళహస్తి,అక్టోబర్ 15 ప్రభాతవార్త: రాష్ట్ర పోల్యూషన్ బోర్డు ఛైర్మెన్ ఆర్ కృష్ణయ్య శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. ఆయన రాక సందర్భంగా దక్షిణ గోపురం వద్ద ఆలయనకు ఆలయ మర్యాదలతో ఎఇఓ మోహన్,ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయనకు సహస్రలింగేశ్వరుని సన్నిధి వద్ద వేదపండితులతో రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి,టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## పతనమైన పూల ధరలు...అన్నదాతల్లో నిరాశ

వి.కోట, అక్టోబర్ 15 ప్రభాతవార్త: పండగల సీజన్‌లో పూలకు మంచి ధరలు వస్తాయని అనుకున్న రైతులకు ధరలు తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. మండలంలో రైతులు అత్యధికంగా పూలసాగు చేపట్టారు. దసరా సందర్భంగా బంతిపూలు కిలో యాభై, చామంతి కిలో వంద రూపాయల ధర పలికాయి. పండగ అనంతరం ఒక్కసారిగా ధరలు తగ్గాయి. బంతిపూలు కిలో 10-30రూ.ల లోపు పలుకగా నలభై కిలోల చామంతి పూల బస్తా 100-300రూ.లుపలుకుతోంది. దీంతో రవాణా, కూలీల పంటకోత ఖర్చులుసైతం రావడం లేదని రైతులు వాపోతున్నారు. కాగా రైతులనుంచి తక్కువ ధరకేపూలు కొనుగోలు చేసే వ్యాపారులు అధిక ధరలకు పూలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

## పర్యావరణ పరిరక్షణకు చర్యలు : కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 15 ప్రభాతవార్త: జిల్లాలో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల ఆధునీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్‌లో విస్తృతంగా కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్టనర్‌షిప్ డ్రైవ్‌ను అక్టోబర్ 15 నుండి నవంబర్ 15 వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి చిత్తూరు జోనల్ మేనేజర్ వైవికె సుబ్బారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం సూరిబాబు, పారిశ్రామికవేత్త సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.